క్లుప్తంగా

ఘనంగా అయ్యప్ప గ్రామోత్సవం



గ్రామోత్సవం నిర్వహిస్తున్న మాలాధారులు

కొలిమిగుండ్ల: నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని బుధవారం కనకాద్రిపల్లెలో అయ్యప్ప స్వాముల ఆధ్వర్యంలో స్వామివారి గ్రామోత్సవం ఘనంగా నిర్వహించారు. ముందుగా గ్రామంలోని అయ్యప్ప స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ప్రత్యేక పల్లకీలో పూలతో స్వామి ఉత్సవ విగ్రహాన్ని అలంకరించారు. మేళ తాళాలు, మాలధారుల కీర్తనల మధ్య గ్రామంలోని వీధుల గుండా గ్రామోత్సవం నిర్వహించారు. గ్రామస్తులు స్వామివారిని దర్శించుకొని పూజలు చేశారు.

నేడు మహా అన్నదానం



బుధవారం ఆలయంలో భిక్ష చేస్తున్న మాలాధారులు

డోన్: స్థానిక అయ్యప్ప స్వామి దేవాలయంలో గురువారం మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు ఒక ప్రకటనలో తెలిపారు. 40 రోజులకు పైగా ఆలయంలో అయ్యప్ప స్వామి మాలాధారులకు నిత్యాన్నదాన కార్యక్రమాన్ని దాతల సహాయంతో దిగ్విజయంగా నిర్వహించామన్నారు. నేడు జరిగే మహా అన్నదాన కార్యక్రమంలో ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కమిటీ సభ్యులు విజ్ఞప్తి చేశారు.

కొత్త ఆలోచనలతో ముందుకుసాగాలి

బనగానపల్లె రూరల్: నూతన సంవత్సరంలో ప్రతీ ఒక్కరూ కొత్త ఆలోచనలతో ముందుకు సాగాలని సీఎస్ఐ టౌన్ చర్చి ఫాదర్ రెవరెండ్ దైవాధీనం అన్నారు. నూతన సంవత్సరం సందర్భంగా బుధవారం మండలంలోని పలు గ్రామాల్లోని క్రైస్తవ చర్చిలో ప్రత్యేక ఆరాధనలు జరిగాయి. బనగానపల్లె పట్టణంలోని ప్రధాన చర్చి సీఎస్ఐ టౌన్ చర్చిలో ఫాదర్ రెవరెండ్ దైవాధీనం, మదర్‌థెరిస్సా చర్చిలో ఫాదర్ డాక్టర్ బాబురాజ్ ఆధ్వర్యంలో ప్రార్థనాలు జరిగాయి. కొత్త సంవత్సరంలో క్రైస్తవ కుటుంబాలు అనుసరించాల్సిన విధానాలు, సేవా కార్యక్రమాలను వివరించారు. ఆయా చర్చి సంఘాల పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ మండల, పట్టణ కన్వీనర్ల ఎన్నిక

బేతంచెర్ల: పట్టణంలోని అమ్మవారి శాలలో బీజేపీ రాష్ట్ర నాయకుడు హేమ సుందర్‌రెడ్డి, డోన్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ సంధు రమణ ఆధ్వర్యంలో బేతంచెర్ల మండల, పట్టణ కన్వీనర్లుగా ఆంజనేయులు, గుండా అశ్వర్థ నారాయణను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారికి డిక్లరేషన్ ఫారం అందజేశారు. మండల, పట్టణ కన్వీనర్లు ఆంజనేయులు, గుండా అశ్వర్థ నారాయణ మాట్లాడుతూ.. తమపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా పార్టీ అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. అనంతరం వారిని పలువురు అభినందించారు. పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు గుండా గోపాలు, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

రేపటి నుంచి మధ్యాహ్న భోజన పథకం

కొలిమిగుండ్ల: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం నుంచి ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేస్తున్నట్లు ప్రిన్సిపాల్ శ్రీనివాసులు తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు బుధవారం నుంచి ఈ పథకం ప్రారంభం కావాల్సి ఉండగా మాజీ ప్రధానమంత్రి మన్మోహన్‌సింగ్ సంతాపదినాలు ఉండటంతో వాయిదా వేశారన్నారు. ప్రస్తుతానికి స్థానిక ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన ఏజెన్సీ నిర్వహిస్తున్న వారే కళాశాలలో ఏర్పాటు చేస్తారని చెప్పారు. మార్చి 1వ తేదీ నుంచి ఇంటర్ పరీక్షలు ఉండటంతో రెండు నెలలు మాత్రమే ఉన్నత పాఠశాలకు చెందిన ఏజెన్సీతో నడిపిస్తున్నట్లు పేర్కొన్నారు.

నాపరాతి గనుల్లో విద్యుత్ తీగలు చోరీ

కొలిమిగుండ్ల: నాపరాతి గనుల్లో విద్యుత్ తీగల చోరీలు జరుగుతూనే ఉన్నాయి. ఎక్కడో ఒక చోట గుర్తు తెలియని వ్యక్తులు తీగలను తీసుకెళుతున్నారు. బుధవారం మీర్జాపురంలో మూడు గనుల్లో ట్రాన్స్‌ఫార్మర్ నుంచి కోత మిషన్ వరకు ఏర్పాటు చేసుకున్న తీగలను అపహరించారు. వాటి విలువ రూ.60 వేలకు పైగానే ఉంటుందని యజమానులు వాపోయారు. గనుల్లో చాలా చోట్ల విద్యుత్‌తో పని చేసే కోత మిషన్‌లను యజమానులు ఏర్పాటు చేసుకున్నారు. తీగలో విలువైన కాపర్ ఉండటంతో వాటి కోసం దొంగలు చోరీలకు పాల్పడుతున్నారు. ఎవరు చేస్తున్నారో ఇప్పటి వరకు తెలియలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వేలాది రూపాయలు ఖర్చు చేసి మళ్లీ కొనుగోలు చేయాల్సి వస్తుందన్నారు.



డోన్: దివ్యాంగుడికి శుభాకాంక్షలు తెలుపుతున్న మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి



బేతంచెర్ల: ఎంపీపీ, నగర పంచాయతీ చైర్మన్‌ను సత్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



బేతంచెర్ల: తెలుగు బాప్టిస్టు చర్చిలో పేదలకు దుస్తులు పంపిణీ చేస్తున్న దృశ్యం



డోన్ టౌన్: ఎంవీఐ క్రాంతికుమార్‌ను అభినందిస్తున్న దృశ్యం

నూతన జోష్

డోన్: నూతన సంవత్సరానికి స్వాగతం పలుకుతూ డోన్ నియోజకవర్గవ్యాప్తంగా బుధవారం వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. కేక్ కటింగ్‌లు, విందువినోదాలతో, పార్టీలతో హోరెత్తించారు. ఉదయం ఆలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు చేశారు.తమ అభిమాన నాయకులు, ప్రజాప్రతినిధులను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డికి నియోజకవర్గ ప్రజలు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు.వేకువజాము నుంచే ఆయన స్వగృహానికి ప్యాపిలి, డోన్, బేతంచెర్ల మండలాల్లోని వివిధ గ్రామాల ప్రజలు, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు పెద్దసంఖ్యలో చేరుకొని బొకేలు, పూలమాలలతో సత్కరించారు. మీట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ శ్రీరాములు, ఎంపీపీ రేగటి రాజశేఖర్‌రెడ్డి, జెడ్పీటీసీ బద్దల రాజ్‌కుమార్, మున్సిపల్ చైర్మన్ సప్తశైలరాజేష్, వైస్‌చైర్మన్ జాకీర్‌హుసేన్, మల్లెంపల్లె రామచంద్రుడు, సోమేష్ యాదవ్, అబ్దుల్లా, సతీష్, పాలుట్ల రఘురాం తదితరులు ఉన్నారు. వివిధ ఉపాధ్యాయ సంఘాలు నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆయనతో ఆవిష్కరింపజేశారు.

బేతంచెర్ల: పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డికి ఆయా గ్రామాల వైఎస్సార్‌సీపీ నాయకులు పూలమాలలు వేసి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే తహసీల్దార్ ప్రకాశ్ బాబు, ఎంపీడీఓ ఫజుల్ రహిమాన్, సీఐ డీ.వెంకటేశ్వరరావు, ఎస్ఐ రమేష్‌బాబు, నగర పంచాయతీ కార్యాలయంలో కమిషనర్ హరిప్రసాద్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

సీఐటీయూ ఆధ్వర్యంలో..

డోన్ టౌన్: సీఐటీయూ ఆధ్వర్యంలో అనుబంధ సంఘాల నాయకులు, కార్మికులతో కలిసి అధికారులు, న్యాయవాదులకు శుభాకాంక్షలు తెలియజేశారు. డోన్ లారీ మోటార్ వర్కర్స్ యూనియన్ కార్యదర్శి శివరా మ్ అధ్యక్షతన కార్మికులు యూనియన్ గౌరవాధ్యక్షు డు, సీనియర్ న్యాయవాది నాగభూషణంరెడ్డిని, డోన్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ క్రాంతికుమార్‌ను కలిసి పుష్పగుచ్ఛాలు అందించి, పూల మాలలు వేసి సత్కరించారు.



బేతంచెర్లలో మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డిని గజమాలతో సత్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు

బేతంచెర్ల: మండలంలోని సిమెంట్‌నగర్‌లోని సీఎస్ఐ చర్చిలో పాస్టర్ వినోద్‌కుమార్, సంఘ పెద్దల ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. తెలుగు బాపిస్టు చర్చిలో పాస్టర్ రెవరెండ్ ప్రసంగి సంఘం పెద్దల ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలతో పాటు యాకోబ్, నాగేష్, శరత్ బాబు సహకారంతో 100 మంది పేదలకు దుస్తులను పంపిణీ చేశారు. చిన్నారులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అలాగే ఆర్ఎస్ రంగాపురం, బేతంచెర్లలోని యేరుషలేం, సీఎస్ఐ, ఆర్‌సీఎం, ఆయా కాలనీల చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి.

అందరికీ మంచి జరగాలి

బేతంచెర్ల: భగవంతుని అనుగ్రహంతో నూతన సంవత్సరంలో అందరికీ మంచి జరగాలని ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి అన్నారు. పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మాజీ మంత్రి బుగ్గనకు శుభాకాంక్షలు తెలిపేందుకు భారీగా ప్రజలు, వైఎస్సార్‌సీపీ నాయకులు, ప్రజా ప్రతినిధులు తరలివచ్చారు. గజమాలలు, పూలమాలలు వేసి శాలువాలతో సత్కరించారు. ఆయా గ్రామాల నాయకులు, ప్రజలను యోగ క్షేమాలను బుగ్గన అడిగి తెలుసుకున్నారు. ఎలాంటి సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి, వివిధ కార్పొరేషన్ల డైరెక్టర్లు ముర్తుజావలి, ఖాజా హుసేన్, బాబుల్ రెడ్డి, మురళీ కృష్ణ, నగర పంచాయతీ వైస్ చైర్మన్ నాగ వెంకటేశ్వర్లు, వార్డు కౌన్సిలర్లు మధు, కోట్ల మధు, చింతల నాగిరెడ్డి, ఇబ్రహీం, సర్పంచ్‌లు శ్రీరాములు, వెంకటేశ్వర్లు, వేణు గోపాల్ రెడ్డి, యుగంధర్‌రెడ్డి, చిన్న మద్దమ్మ, తిమ్మయ్య, ఎంపీటీసీలు నాగోశేషు, రామచంద్రా రెడ్డి, రంగస్వామి, నాయకులు రామచంద్రుడు, చంద్రారెడ్డి, లక్ష్మిరెడ్డి, రాజేంద్రనాథ్ రెడ్డి, గూని నాగరాజు, దస్తగిరి, నాగేశ్వర్‌రెడ్డి, కుమార్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

కోలాహలంగా వేడుకలు

కోవెలకుంట్ల: నూతన సంవత్సరానికి స్వాగతం పలుకుతూ బనగానపల్లె నియోజకవర్గంలోని ఆయా గ్రామాల్లో బుధవారం కొత్త సంవత్సర వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. కోవెలకుంట్ల, సంజామల, ఉయ్యాలవాడ మండలాల్లోని వివిధ గ్రామాలకు చెందిన అభిమానులు ఏపీ ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మాజీ చైర్‌పర్సన్ కర్రా గిరిజ, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి కర్రా హర్షవర్ధన్‌రెడ్డి స్వగృహానికి చేరుకుని పూలమాలలు, బొకేలు అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఎంపీపీ భీమిరెడ్డి రమాదేవి, ఉప సర్పంచ్ జీసీఆర్ సూర్యనారాయణరెడ్డి, జెడ్పీటీసీ వెంకటలక్ష్మమ్మను మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన అభిమానులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, అధ్యాపకులు, వ్యాపారులు, కార్మికులతోపాటు మిగతా అన్ని వర్గాల ప్రజలు నూతన సంవత్సర వేడుకలను ఘనంగా నిర్వహించారు. పట్టణంలో చిన్నారులు గ్రీటింగ్ కార్డులు, చాక్లెట్లతో శుభాకాంక్షలు చెబుతూ సందడి చేశారు. పూలు, పండ్లు, స్వీట్లు, బొకేల షాపులు జనాలతో కిటకిటలాడాయి. కొత్త సంవత్సరం అన్ని విధాలా కలిసి రావాలని పట్టణంలోని వివిధ కాలనీలకు చెందిన మహిళలు సాయిబాబా, పాండురంగస్వామి, తదితర ఆలయాలకు చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు.

కొలిమిగుండ్ల: స్థానిక ఆర్టీసీ బస్టాండ్ సెంటర్‌లో యువకులు ఏర్పాటు చేసిన కేక్‌ను సీఐ రమేష్‌బాబు కట్ చేశారు. వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు అంబటి గుర్విరెడ్డి స్వగ్రామం చింతలాయిపల్లెకు పలు గ్రామాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు చేరుకొని శుభాకాంక్షలు తెలిపారు. కొలిమిగుండ్లలోని పోతిరెడ్డి రామసుబ్బారెడ్డి సేవా ట్రస్ట్ కార్యాలయంలో అధ్యక్షుడు వెంకటసుబ్బారెడ్డి కేక్ కట్ చేశారు. అభిమానులకు స్వీట్లు పంపిణీ చేశారు. పలు చర్చిల్లో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేసి కేక్‌లు కట్ చేశారు.

బనగానపల్లె రూరల్: బనగానపల్లెలోని పలు శాఖల అధికారులను సిబ్బంది కలిసి న్యూ ఇయర్ శుభాకాంక్షలు తెలిపారు. బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జూనియర్ సివిల్ కోర్టు ఇన్‌చార్జ్ జడ్జి షేక్ అబ్దుల్ రహిమాన్‌ను కోవెలకుంట్లలోని జడ్జి బంగ్లాలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఖాజా హుస్సేన్, కార్యదర్శి వెంకటేష్, ట్రెజరర్ రఘురామిరెడ్డి, తదితరులు ఉన్నారు.

సంజామల: స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఎంపీపీ పోచా రమాదేవికి అధికారులు ఎంపీడీఓ సాల్మన్, ఈఓఆర్‌డీ రాధిక రెడ్డి, ఏఓ విజయకుమార్ రెడ్డి, తదితరులు నూతన సంవత్సర శుభకాంక్షలు తెలిపారు. నొస్సంలో జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ మల్కిరెడ్డి వెంకట సుబ్బారెడ్డికి కార్యకర్తలు అభిమానులు శుభాకాంక్షలు తెలిపారు.



కోవెలకుంట్ల: ఏపీ ఐడీసీ మాజీ చైర్‌పర్సన్ కర్రా దంపతులకు శుభాకాంక్షలు తెలుపుతున్న అభిమానులు



కొలిమిగుండ్ల: పోతిరెడ్డి ట్రస్ట్ కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న వెంకటసుబ్బారెడ్డి





సంజామల: ఎంపీపీ పోచా రమాదేవికి శుభాకాంక్షలు తెలుపుతున్న ఎంపీడీఓ, సిబ్బంది, బనగానపల్లె కోర్టు జడ్జి షేక్ అబ్దుల్ రహిమాన్‌తో న్యాయవాదులు

బైకులు ఢీకొని ఒకరికి తీవ్రగాయాలు

డోన్ టౌన్: పట్టణ సమీపంలోని జాతీయ రహదారి వెంకటాపురం సర్కిల్‌లో ఉన్న బాలాజీ రెస్టారెంట్ వద్ద రెండు బైకులు ఢీకొనడంతో సలామల్లా అనే వ్యక్తికి తీవ్రగాయాలైనట్లు స్థానికులు తెలిపారు. కృష్ణగిరి మండలం పెనుమాడ గ్రామానికి చెందిన సలామల్లా వ్యక్తిగత పనుల నిమిత్తం బైక్‌పై డోన్‌కు వెళుతుండగా ఎదురుగా వచ్చిన మరో బైక్ ఢీకొట్టడంతో తలకు తీవ్రగాయాలయ్యాయి. గాయపడిన సలాముల్లాను 108 వాహనంలో డోన్ ప్రభుత్వ వైద్యశాలకు తరలించి చికిత్స చేయిస్తున్నారు.

ఈ-కేవైసీ చేయించుకోవాలి

కొలిమిగుండ్ల: హనుమంతుగుండం సహకార సంఘానికి చెందిన ఖాతాదారులు తప్పనిసరిగా ఈ-కేవైసీ చేయించుకోవాలని పీఐసీ సబ్ డివిజనల్ ఆఫీసర్ రాచయ్య బుధవారం తెలిపారు. సున్నా వడ్డీ రుణాలు, ప్రభుత్వ పథకాలు, రాయితీలు పొందాలంటే ఆయా గ్రామ సచివాలయాల్లో ఈ-కేవైసీ చేయించుకోవాలని సూచించారు. అలాగే సహకార సంఘం ఎన్నికల్లో ఓటు హక్కు ఉంటుందని, లేదంటే ఓటు హక్కు కోల్పోయే ప్రమాదముందన్నారు. ఖాతాదారులు నిర్లక్ష్యం చేయకుండా సంబంధిత సచివాలయాల్లో తప్పకుండా ఈ-కేవైసీ చేయించుకోవాలని కోరారు.

చల్లాకు ఘన నివాళి

అవుకు: మాజీ ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, జాతీయస్థాయి కృషి పండిట్ అవార్డు గ్రహీత, దివంగత నేత చల్లా రామకృష్ణా రెడ్డి 4వ వర్ధంతి సందర్భంగా బుధవారం కుటుంబ సభ్యులు ఘనంగా నివాళులర్పించారు. అభిమానులతో కలిసి తాడిపత్రి రహదారిలో చల్లా ఫామ్ హౌస్‌లోని ఆయన సమాధికి పూలమాలలు వేసి ఆయన్ను స్మరించుకున్నారు. అలాగే ఎర్రమల కొండల్లో వెలిసిన శ్రీ లక్ష్మీ కంబగిరి స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత చల్లా సూర్యప్రకాశ్ రెడ్డి, ఎంపీపీ రాజశేఖర్ రెడ్డి, ముఖ్య నాయకులు అమర్నాథ్ రెడ్డి, విఘ్నేశ్వర్ రెడ్డి, ఉపసర్పంచ్ రఘునాథ్ రెడ్డి, నాయకులు పోతిరెడ్డి శ్రీనివాస రెడ్డి అభిమానులు పాల్గొన్నారు.

పకడ్బందీగా గస్తీ

నూతన సంవత్సర వేడుకల్లో ఆవాంఛనీయ సంఘటనలు, అపశృతులు చోటు చేసుకోకుండా పోలీసులు ముమ్మరంగా గస్తీ చేపట్టారు. గతేడాది దుర్ఘటనలను దృష్టిలో ఉంచుకొని డీఎస్పీ శ్రీనివాసులు ఆదేశాలతో ప్రత్యేక ప్రణాళిక రూపొందించి వేడుకలపై ఆంక్షలు విధిస్తూ రెండు రోజులు ముందుగానే పత్రికలు, టీవీల ద్వారా ప్రజలకు సమాచారం అందించారు. పట్టణంలో 30 పోలీసు యాక్ట్ అమలు చేస్తూ బైక్ రైడింగ్‌లు, నడి రోడ్లపై కేక్ కటింగ్‌లు, డీజేలు, మ్యూజిక్ షోలను నిషేధించారు. డివిజన్‌లోని పలు పోలీసు స్టేషన్ల నుంచి సిబ్బందిని పట్టణానికి రప్పించి సీఐలు ఇంతియాజ్‌బాషా, సీయం రాకేష్‌లకు తోడుగా ఎస్ఐలు శరత్‌కుమార్‌రెడ్డి, నరేంద్రకుమార్, మమత మరియు ఏఎస్ఐలు, బ్లూకోర్ట్ సిబ్బందితో ప్రత్యేక బందోబస్తు నిర్వహించి డ్రంకన్ డ్రైవ్, వెహికల్ చెకింగ్‌తో పాటు పట్టణంలోని ఫ్లైఓవర్‌పై రాకపోకలు నిషేధించారు. సీసీ కెమెరాల పరిశీలనతో పాటు రెండు డ్రోన్ కెమెరాలతో పట్టణంలోని ప్రతి కాలనీపై నిఘాపెట్టి నూతన సంవత్సర వేడుకల్లో దుర్ఘటనలు జరగకుండా పోలీసులు సఫలీకృతులు అయ్యారు.

– డోన్ టౌన్



డోన్‌లో బారికేడ్లు ఏర్పాటుచేసి గస్తీ కాస్తున్న పోలీసులు



న్యూ ఇయర్ రాత్రి నిర్మానుష్యంగా ఫ్లైఓవర్



ఆలయ ప్రధాన గోపురం వద్ద భక్తుల రద్దీ



వేంకటేశ్వరస్వామి గుహ వద్ద భక్తులు

యాగంటిలో భక్తుల సందడి

మండలంలోని ప్రముఖ శైవక్షేత్రం

యాగంటి నూతన సంవత్సరం ప్రారంభ రోజున భక్తులు, పర్యాటకుల సందడితో కళకళలాడింది. ఆయా గ్రామాలకు చెందిన ప్రజలు పెద్ద ఎత్తున ఆలయానికి చేరుకుని స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయంలో ఏకశిలా రూపంలో వెలసిన ఉమామహేశ్వరస్వామి, రోజురోజుకు పెరుగుతున్న నందీశ్వరుడు, వేంకటేశ్వర స్వామి గుహ, వీరబ్రహ్మేంద్ర స్వామి గుహ, శంకర గుహలను సందర్శించి పూజలు చేశారు.

– బనగానపల్లె రూరల్



కోవెలకుంట్ల- సంజామల రహదారిలో దట్టంగా కురుస్తున్న పొగమంచు



శనగ పైరును కమ్మేసిన పొగమంచు

కమ్మేసిన పొగమంచు

శీతాకాలం కావడంతో ఉష్ణోగ్రతలు

గణనీయంగా తగ్గి చలి, మంచు విజృంభిస్తోంది. రెండు రోజుల నుంచి బనగానపల్లె నియోజకవర్గంలో ఆయా మండలాల పరిధిలో పొగ మంచు దట్టంగా కురుస్తోంది. బుధవారం తెల్లవారుజామున ప్రారంభమైన పొగమంచు దాదాపు రెండున్నర గంటలకు పైగా కోవెలకుంట్ల పట్టణాన్ని కప్పేసింది. ఎదురుగా ఉన్న మనిషి కనపడనంత దట్టంగా పొగ మంచు కురవడంతో ఉదయం 7.30 గంటలైనా వాహన చోదకులు లైట్లు వేసుకుని రాకపోకలు సాగించారు. పంట పొలాలపై పొగమంచు దట్టంగా కురుస్తుండడంతో పప్పు శనగ రైతులు ఆందోళన చెందుతున్నారు. పూత, పిందె దశలో పొగమంచు కారణంగా పూత రాలిపోయే ఆస్కారం ఉందని రైతులు వాపోతున్నారు.

– కోవెలకుంట్ల



కబడ్డీ ఆడుతున్న మహిళలు

కబడ్డీ.. కబడ్డీ

నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని కోవెలకుంట్ల పట్టణంలోని సీఎస్ఐ చర్చి, సెయింట్ జోసఫ్ ఉన్నత పాఠశాల ఆవణల్లో బుధవారం నిర్వహించిన క్రీడా పోటీలు అలరించాయి. చిన్న పిల్లలు, మహిళలు, పురుషుల విభాగాల్లో కబడ్డీ, ఖోఖో, పరుగు పందెం, గోనె సంచులతో కుప్పిగంతులు, లెమన్‌స్పూన్, తదితర పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఎల్ఎం కాంపౌండ్, స్వామినగర్ కాలనీలకు చెందిన మహిళలు పోటీలను తిలకించేందుకు ఆసక్తి కనబరచడంతో న్యూ ఇయర్ సందడి నెలకొంది.

– కోవెలకుంట్ల



హోరాహోరీగా పురుషుల కబడ్డీ పోటీలు